# నీలిమ

సన్నగా గాలిలో తేలుతూ వినిపిస్తున్నదాపాట. జాజి పందిరి క్రింద కూర్చుని, సన్నజాజులను దండ కడుతున్న నీలిమ, తన విశాలమైన కళ్ళను పైకెత్తి ఆవలోకనగా చుట్టూ చూసింది....

"మధురానగరి సమీపంలో, మలయాయత సమీరంలో...."కృష్ణశాస్త్రిగారి తీయటి కవిత యింకా తీయగా చెవులకు సోకుతున్నది.

నీలిమకు ఆ పాటలోని సాహిత్యపు మృదుత్వం, లాలిత్యం అంటే చాలా ఇష్టం.

"బిరానా వరాలా కరాలుసాతూ..." చక్కటి కంఠస్వరం ఎవరో కాని చాలా బాగా పాడుతున్నారు.

నీలిమకు సన్నజాజుల మధురత్వం, ఆ పాటలోని తియ్యదనం ముందు వెలవెలా పోయినట్టు అనిపించింది.

కట్టిన సన్నజాజుల మాలను హడావిడిగా జడలో తురుముకుని లేచి నుంచింది...

ఆసక్తిగా చూసింది ఆ పాట ఎక్కడి నుంచి వస్తున్నదా అని.......

పాట ఆగిపోవటం వల్ల ఆమె ప్రయత్నం ఫలించలేదు.

మర్నాడు సాయంత్రం కూడా అదే వేళ మళ్ళీ పాట వినిపించింది.

ఈసారి 'పాటపాడుమా కృష్ణా పలుకుతేనెలొలుకునటుల' అంటూ కోయిల కంఠంతో పాడుతున్నాడతను.

పురివిప్పిన నెమలిలా పులకించిపోయింది నీలిమ.

ఆ గాన మాధురిలో అలా అలా తేలిపోయింది ఆమె మనసు.

ఎదురింటి మేడ మీద గదిలో నుంచి వస్తున్న ఆ పాట పాడుతున్నదెవరో చూడాలనే కుతూహలం కూడా కలిగిందామెకు...

ఆమె కోరిక తీర్పటానికా అన్నట్టు కాసేపటికి అతను, గదికి తాళం వేసి క్రిందకు దిగి రోడ్డు మీదకు వచ్చాడు.

సూటిగా ఈ నీలిమ వేపు చూశాడు.

జాజి పందిరి క్రింద, సన్నగా సన్నజాజి తీవలా, తెల్లటి శరీరచ్ఛాయతో, అప్సరసలావున్న నీలిమ, ఒక విరహిణిలా కనపడిందతనికి.

బాగా పెరిగిన క్రాపు నుదుటి మీద పడుతూ, మంచి ఒడ్డూ పొడుగూతో వున్న విశ్వం ఆమెకు మధుర గానానికి మారుపేరుగా కనిపించాడు.

విశ్వం ఆమె కళ్ళలోకి చూసి చిన్నగా నవ్వాడు.

ఆమె ఒకింత తడబాటు పడింది.

అతను, చిన్నగా నవ్వుతూ వెళ్ళిపోయాడు.

నీలిమ వెడుతున్న అతణ్ణే చూస్తూ నిట్టూర్చింది.

అతను అలా రోజూ గళం విప్పి పాట పాడటం చాలు నీలిమ చెవులు రిక్కించుకుని ఆ పాటలోని రసాస్వాదన చేసేది.

ఆమె మనసు ఆ గాన మాధురికి ఉవ్వెత్తున ఎగిరిపడేది.

విశ్వం ఆమెను చూసినప్పుడల్లా సన్నగా నవ్వుతూ ఉండేవాడు.

మొదట్లో నీలిమ తడబడినా తర్వాత తన చిన్న చిన్న అందమైన పెదవుల మీద మెరుపులా ఒక చిరునవ్వును చిందించేది.

అతను ఆమె దరహాసం చూసి, అంత అందాన్ని ఒక్కసారి భరించలేక, అలాగే ఆ

సౌందర్యాన్ని చూస్తూ నిలబడిపోయేవాడు.

అతని గానం ఆమెనెంత ఆకర్షించిందో, ఆమె సౌందర్యం అతన్ని అంత ఆకర్షించింది.

ఆమె నోరు విప్పి తనతో మాట్లాడితే, తనంతవాడు వుండడని అతని ఆశ, ఆశయం.

కానీ ఎన్నో రోజులు ఇద్దరి మధ్యా మాటలు జరగలేదు.

అయితే ఆమె, అతని పాటకు పరవశించిపోతుంది.

ఆమె సౌందర్యానికి ముగ్ధుడయిపోతున్నాడు.

ఒక శుభ సమయంలో ఇద్దరి మధ్యా మాటలు కూడా జరిగేయి.

"మిమ్మల్ని రోజూ చూస్తూ వుంటాను!"

"నేను కూడా రోజూ మీ పాట వింటూవుంటాను!"

"నా పేరు విశ్వం"

" నా పేరు నీలిమ"

"తీయటి పేరు..మీ సౌందర్యానికి తగ్గ పేరు!"

" అనవసరంగా నన్ను పొగడకండి...మీ గాన సౌరభాల ముందు నా పేరు ఏపాటి తియ్యదనం. మీ పాటలు అంటే నాకు చాలా ఇష్టం!"

"నాకూనూ...మిమ్మల్ని చూస్తూ ఎన్ని జన్మలేనా గడపగలననిపిస్తున్నది."

పరిచయాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి.

"మీ చదువు ఇంకా ఎన్నాళ్ళలో పూర్తవుతుంది..నీలిమా?"

"పరీక్షలు అవటమే ఆలస్యం... తర్వాత రిజల్ట్సు వచ్చే దాకా ఎలాగో అలా గడిపేయటం..."

"తర్వాత"

"తర్వాత ఏముంది.. ఏదన్నా వుద్యోగం చేయటం. మా నాన్న ఒప్పుకోకపోతే ఆయన కుదిర్చిన వాడిని పెళ్ళిచేసుకోవడం!"

అతని ముఖంలో ఏదో బాధ లీలగా కనిపించింది.

"పెళ్ళి చేసుకుంటే చేసుకోండిగానీ నిరుద్యోగుల్ని మాత్రం చేసుకోకండి. మీరు జీవితంలో సుఖపడాలంటే డబ్బున్నవాడ్ని చేసుకోవటం అవసరం!" చిన్నగా నిట్టూర్చాడు.

"అదేమిటి?" అన్నదామె కళ్ళు టపటపా ఆర్పి, నవ్వుతూ.

"చూస్తున్నారుగా నన్ను...చదివిన చదువు ఎందుకూ పనికిరావటంలేదు. నా ఆకలి తీర్చుకోలేని నేను.. ఇక పెళ్ళాన్నేం భరించగలను. అందుకే మీరు, ఏ నిరుద్యోగినో, చిరుద్యోగినో చేసుకోక నేను చెప్పినట్టు చేయండి!"

"ఏమిటి నా మీద మీకు అధికారం?"

"అధికారం కాదు అనురాగం..మిమ్మల్ని చూసినప్పటి నుంచీ, ఏమిటో చెప్పలేని 'రిలీఫ్' కలుగుతున్నది. నా ఉద్యోగ ప్రయత్నాల్లోని విసుగునూ, నిస్పృహను, నిరాశను

పారద్రోలి రోజూ క్రొత్త శక్తి నిస్తుంది మీ పెదవుల మధ్య మెరిసే చిరునవ్వు...''

"అంతకు మించి నన్ను ఉత్తేజం పరిచేది మీ గానం. చదివీ, చదివీ విసుగుపుట్టినప్పుడు మీ పాటలు నన్ను ఆహ్లాదపరచి, నన్ను అదో లోకంలో విహరింపచేస్తాయి..అన్నట్టు ఇంత చక్కగా పాడే మీకు ఉద్యోగం దొరకకపోవటం ఏమిటి?''

నవ్వాడు విశ్వం.

"ఈనాడు కళాకారులను పోషించేదెవరు?....ముఖ్యంగా సినిమాల్లోను, రేడియోల్లోనూ తప్ప ఏ గాయకుడూ తన పాటల మీద వచ్చే డబ్బుతో జీవితాన్ని పూర్తిగా అనుభవించగలుగుతున్నాడు? నేను సినిమాల్లోనేకాక, రేడియోల్లోనూ ప్రయత్నంచేశాను. ప్రతీ చోటా కులమతబేధాలు ప్రాంతీయ అభిమానాలు, సిఫారసులు, వాటి మధ్య నాలాటి వాడికి వుద్యోగమిచ్చేదెవరు? అందుకే అటు నా గాన మాధుర్యం, ఇటు నా బి.ఏ. డిగ్రీ ఎందుకూ పనికిరాకుండా పోయాయి.''

"మీరు అనవసరంగా బాధపడుతున్నారు. కొన్నాళ్ళు వోపిక పడితే మీరు వుద్యోగం సంపాదించుకుని, మీ గానాన్ని కూడా బాగా సాధన చేసి పలువురిని రంజింపచేయగలరని నాకు గట్టి నమ్మకం వుంది!''

మీ నమ్మకం నాకు ప్రోత్సాహాన్ని ఇస్తున్నది. కానీ.. ఒ.కె. ..చూద్దాం.. మీమాట ఎంతవరకు నిజమవుతుందో....''

ఆమె నవ్వింది, బుగ్గలు సొట్టపడేలా.

"మీ నోటి ద్వారా కృష్ణశాస్త్రిగారి పాటలు వినాలని వుంది!'' అన్నదొకరోజు నీలిమ, విశ్వం ఖాళీగా ఉండటం చూసి.

"తప్పకుండాను. మీలాటి అందమైన ఆడపిల్ల నోరు తెరచి అడిగితే కాదనేంత మూర్ఖుడిని కాదు...మీకు ఇష్టమైన పాట చెప్పండి పాడుతాను!''

ఆమె తనకిష్టమైన పాటలన్నీ అడిగి మరీ మరీ అతని చేత పాడించుకుంది.

అతను గొంతెత్తి పాడుతుంటే ఆమె మైమరిచిపోయింది.

తన్మయత్వం అనుభవిస్తున్న ఆమె సౌందర్యాన్ని చూస్తూ అతను రోజు కన్నా శ్రావ్యంగా పాడాడు.

ఒక రోజు సాయంత్రం సముద్రపు ఒడ్డున కూర్చుని, సన్నగా రాగాలపన చేస్తున్నాడు విశ్వం.

రాజహంసలా నడిచివచ్చి,అతని ప్రక్కన కూర్చున్నది నీలిమ.

అతను పాట ఆపాడు.

"ఆపకండి పూర్తిగా పాడండి'' అన్నదామె నవ్వుతూ.

"సముద్రపు ఒడ్డున, ఈ చల్లగాలిలో, మీలాటి అమ్మాయి ముందు వుండగా పాట ఎందుకు చెప్పండి? ఏవన్నా కబుర్లు చెప్పండి!''

"మీకు చాలా ముఖ్యమైన కబురొకటి చెబుదామనుకుంటున్నాను" నీలిమ అన్నది కనురెప్పలను బరువుగా క్రిందకు వాల్చి.

"ఏమిటది?"

"మా నాన్న నాకు పెళ్ళి చేసే వుద్దేశ్యంలో వున్నాడు"

"శుభం!"

"ఆ విషయమే మీతో మాట్లాడదామని వచ్చాను"

"నాతోనా!" ఆశ్చర్యం నటించాడతను.

"అవును మీతోనే!" దించిన కళ్ళను పైకెత్తింది. అతని కళ్ళల్లోకి దీక్షగా చూస్తూ, "నేను మిమ్మల్నే చేసుకుంటానని నాన్నకి చెప్పాలని నిశ్చయించుకున్నాను!" అన్నది.

ఈసారి అతను నిజంగా ఆశ్చర్యపోయాడు.

"మీరు తీసుకున్న నిర్ణయం తప్పని నా వుద్దేశ్యం. మీలాటి సౌందర్య దేవతను నాలాటివాడు ఆరాధించాలేకానీ, కోరుకోకూడదు. నేను మిమ్మల్ని వివాహం చేసుకోవటానికి ఏ విధానా అర్హుడిని కాదు!"

"అలా అనకండి మిమ్మల్ని ఆ రోజు చూసినప్పటి నుంచీ....."

"నీలిమా తొందరపడకండి...నాకు చదువున్నా వుద్యోగం లేదు. ఆస్థిపాస్తులు అంతకాన్నా లేవు. నా కడుపు నింపుకోవటానికి తిండి లేకపోవటం అటుంచి, బ్రతకటానికే రోజూ భయపడిపోతున్నాను. అలాటి నన్ను, నాలో ఏం చూసి మీరు ఈ నిర్ణయానికి వచ్చారో ఆశ్చర్యంగావుంది!"

"మీలో నన్ను బాగా ఆకర్షించింది మీ మధుర కంఠస్వరం, మీ తీయటి గాన మాధుర్యం. జీవితాంతం మీరు నా ప్రక్కన కూర్చుని, గళం విప్పి పాడుతుంటే, ఆకలి దప్పులేకాదు., ఊపిరి పీల్చటం కూడా మరచిపోయి మీ సందిట ఒదిగిపోగలను..."

"కానీ అలా అయితే మన జీవనం గడవదు నీలిమా! వాస్తవిక జీవితం ఇది. మనిషి ఒక యంత్రంగా మారి, తను చేసిన యంత్రాలకు తనే బానిసయి జీవిస్తున్న ఈ రోజుల్లో, నా గానమాధుర్యంతో ఆకలి తీరదు. మన జీవనం సుఖప్రదంగా వుండదు. నా మాట విని మీ నాన్నగారు చెప్పిన సంబంధం చేసుకోండి.. హాయిగా వుండండి.."

"అలా ఎన్నటికి జరగదని మీకు ముందే చెప్పాను... కష్టమైనా, సుఖమైనా మీతోనే గడుపుతాను...మిమ్మల్నే చేసుకోవాలని నిశ్చయించుకున్నాను. నా నిర్ణయం ఇక మారదు?"

"కానీ నా నిర్ణయం అదికాకపోతే...మీరేం అవుతారో అని భయంగా ఉంది."

నీలిమ నవ్వింది.

"ఏదో అఘాయిత్యం చేసుకునేంత పిచ్చిదాన్ని కాదులేండి....మీ మనసు మారేదాకా నేను అలాగే వేచివుండగలను. ఏనాటికయినా మీదానిగా వుండాలనేదే నా నిర్ణయం. మీ గాన మాధుర్యంలో తేలుతూ, అరమోడ్పు కనులతో అలా అలా మీ హృదయం మీద వాలి, ప్రాణాలు విడిచినా, నా కభ్యంతరం లేదు. మీరు నా జీవనరాగాన్ని శ్రావ్యంగా ఆలపిస్తే

నాకింకేం కావాలి?... నన్ను కాదనకండి!''

దిగివచ్చిన అప్సరస అతన్ని అర్థించింది.

"నీలిమా? నేను ఏనాటికయినా పెళ్ళాడితే నిన్నే చేసుకుంటాను సుమా... కానీ ఆర్థికంగా నేను బాగుపడితే తప్ప...నేను వివాహం చేసుకోదలచుకోలేదు....''

సముద్రంలో అలలు వువ్వెత్తుగా లేచాయి....

మర్నాటి నుంచి విశ్వం కనపడలేదు నీలిమకు.

అడిగితే, అతడు గది ఖాళీ చేశాడని తెలిసింది....

అతని కోసం ఆమె సోగకన్నులు ఆత్రంగా వెదికేవి.

అతని పాట కోసం ఆమె హృదయం ఆక్రోశించేది.

అతని చూపుకోసం ఆమె మనసు పలవరించేది.

కానీ విశ్వం జాడలేదు.

నీలిమ వివాహం చేసుకోనని తండ్రికి గట్టిగా చెప్పేసింది. ఆయన విసుగు పుట్టి ఇక ఆమెను అడగటం మానేశాడు.

వసంత కాలం వచ్చింది.

కోయిలలు పాడుతున్నాయి.

ఆ పాటలో ఏదో లోపం...ఆ రాగాల్లో ఏదో అపశృతి...

నీలిమకు ఇప్పుడు ఏ కోయిల పాడుతున్నా విశ్వం గొంతులాగానే వినిపిస్తున్నది.

ఆమె కురులను సవరించుతూ, చల్లగా ఆమె బుగ్గలను తాకే గాలి ఆమెతో విశ్వం గురించి ఏవో గుసగుసలు చెబుతున్నట్టుగా అనిపించేది.

వాళ్ళ ఇంటి ప్రక్కగా జలజలా పారే కాలువ చేసే శబ్దం అదేదో రాగరసమాధురిలా అనిపించేదామెకు.

గాలీ, నీరూ, చెట్టూ...చేమా ప్రకృతి సర్వస్వం విశ్వం గొంతుతో శ్రావ్యంగా, ఆమె కోసం విరహ గీతాలు పాడుతున్నట్టుగా అనిపించేవి నీలిమకు.

విశ్వం గురించి ఆలోచనలు ఆమెను పూర్తిగా ఆక్రమించుకుని ఆమెకు ఊపిరి సలపనివ్వలేదు.

అందుకే కాలక్షేపంగానన్నా వుంటుందని ఆమె ఉద్యోగంలో చేరింది.

అదో చిన్న ప్రైవేటు కంపెనీ.

ఆ కంపెనీ మానేజింగ్ డైరెక్టర్‌కు ఆమె స్టెనో.

ఆమె టైపు చేస్తున్నప్పుడు ఆ మెషిన్ చేసే శబ్దంలో కూడా ఆమెకు విశ్వం కంఠం వినపడేది.........

అలా అలా అయిదేళ్ళు గడిచిపోయాయి.

నీలిమ ఇంకా అదే కంపెనీలో పనిచేస్తున్నది.

ఆమె పెళ్ళి చేసుకోలేదు.

తండ్రి పరమదించాడు.

పెళ్ళి చేసుకోమని పోరేవారిక లేనందుకు ఆమె హాయిగా నిట్టూర్చింది.

ఆమె జీవితంలో అన్నీ మరచిపోయింది.

సరిగ్గా జీవించటం కూడా మరచిపోయింది.

కానీ ఆమె మరిచి పోనిది, మరచిపోలేనిది ఒక్కటే -

విశ్వం!

విశ్వం కూడా కాదు. విశ్వం గాన మాధుర్యం.

ఆ రోజు ఆమె ఆఫీసుకు వెళ్ళేటప్పటికి కొంచెం ఆలస్యం అయింది.

మానేజింగ్ డైరెక్టర్ రూమ్‌లో ఎవరో వున్నారు. ఎవరూ డిస్టర్బ్ చేయకూడదని బయట వెలుగుతున్న ఎర్ర దీపం సూచిస్తున్నది...

నీలిమ టేబుల్ ముందు కూర్చుని పని చేసుకుంటున్నది.

అలా అరగంట గడచిపోయింది.

ఎం. డి. గదిలో నుంచి నవ్వులు వినిపించగా తల ఎత్తింది... అప్పుడే ఎర్ర లైటు ఆరిపోయింది. అంటే ఏదో ముఖ్య విషయం మీద నిర్ణయాలు జరిగాయన్నమాట.

స్టెనో ని రమ్మనమని సూచనగా బెల్ మ్రోగింది.

నోట్‌బుక్ తీసుకుని, తలుపుతోసుకుని, లోపలకు వెళ్ళింది నీలిమ.

"షి ఈజ్ అవర్ స్టెనో నీలిమ..మీట్ అవర్ న్యూ పార్ట్‌నర్ యిన్ దిస్ బిజినెస్ మిష్టర్..."

ఆయన చెబుతున్నది ఆమె ఇక వినలేదు.

"విశ్వం" అన్న మాటలు ఆమె పెదవుల మీదనుంచి అస్పష్టంగా వెలువడ్డాయి.

"నీలిమా...నువ్వా!" అతని ముఖం వింతకాంతులతో మెరిసింది.

ఖరీదైన సూట్‌లో, ఇంకా ఖరీదుగా మెరిసిపోతున్నాడు విశ్వం. మంచి రంగు వచ్చాడు... ముఖంలో ఆకర్షణ..ఇప్పుడు మనిషి నిండుగా వున్నాడు కూడాను.

"ఎలా ఉన్నావ్......." కొంచెం ఆగి అడిగాడు ఆప్యాయంగా.

"ఇలాగే చూస్తున్నారుగా?" నవ్వింది నీలిమ.

అతనూ నవ్వాడు.

కొంచెం ఆగి ఆమె అడిగింది "ఇన్నాళ్ళు మీరు..."

"అన్ని చెబుతాను తర్వాత.. పద వెడదాం బయటకు" నడిచాడు విశ్వం.

ఇంపోర్టెడ్ కారు సముద్రపు ఒడ్డున ఆగింది.

కారులో ఎవరూ మాట్లాడలేదు.

విశ్వం, నీలిమ గురించి ఎన్నో ఆలోచిస్తున్నాడు.

నీలిమ, విశ్వం గురించి ఇంకా ఎన్నో ఆలోచిస్తున్నది.

సముద్రపు ఒడ్డున కూర్చున్న తర్వాత అయిదు నిమిషాలకు అడిగాడు విశ్వం "నీలిమా.. నీకు ... వివాహం అయిందా...." అని.

" నా సంగతి చెబుతాను... ముందు మీ సంగతి చెప్పండి..."

"ఏమని చెప్పను.. ఒక నిరుద్యోగిగా నిన్ను నేను వివాహమాడదలుచుకోలేదు. అలా అని నిన్ను రోజూ చూస్తూ కూడా, నిన్ను కాదనుకుని బ్రతకలేకపోయాను. అందుకే ఎవరికీ తెలియకుండా వెళ్ళిపోయాను. ఎక్కడికి వెళ్ళానో, ఇన్నేళ్ళు ఎక్కడెక్కడ తిరిగానో, ఏమేం చేశానో, అదంతా ఒక పెద్ద కథ...కానీ నా కథకు సుఖాంతం యింత సుఖంగా వుంటుందనుకోలేదు. ఇప్పుడు నేను ఒక ధనవంతుడి క్రిందే లెఖ్క. ఆ కంపెనీ ఎక్స్‌టెన్షన్ ప్రోగ్రాంలో రెట్టింపు డబ్బు పెట్టి, నేను ఇప్పుడు కంపెనీ అధినేతనయ్యాను. నా జీవితంలో కోరుకున్న నిన్ను... ఇలా పొందగలిగాను.. అయామ్ సారీ...నీలిమా...నేను తప్పు మాట్లాడితే క్షమించు... నీ సంగతి తెలుసుకోకుండా అంటున్నాను. నీకు...నీకు... పెళ్ళయిందా..?"

"అయింది!" నిర్లిప్తంగా అన్నది నీలిమ.

ఒక్కసారిగా త్రుళ్ళిపడ్డాడు విశ్వం.

"నీలిమా" అన్నాడు బాధగా.

"మీకు వివాహం అయిందోలేదో చెప్పనేలేదు" అన్నది మెల్లగా.

"ఎలా అవుతుంది నీలిమా, నేను పెళ్ళి అంటూ చేసుకుంటే నిన్నే చేసుకుంటానని ఆనాడే చెప్పాను గదా!"

ఆమె తృప్తిగా నిట్టూర్చింది.

నవ్వింది.

"మీ ఆయన ఏం చేస్తుంటారు?" అడిగాడు ఆమె కళ్ళలోకి చూస్తూ విశ్వం.

"నా కళ్ళలోకి చూస్తుంటారు" - పెదవుల మధ్య నవ్వుని నొక్కిపెట్టి అన్నది నీలిమ.

"అదికాదు నేను అడిగింది" కొంచెం విసుగ్గా అన్నాడు విశ్వం.

నీలిమ అతనికి దగ్గరగా జరిగింది.

అతని మెడ చుట్టూ చేతులు వేసి, తలను క్రిందకు వంచి, అతన్ని గట్టిగా ముద్దు పెట్టుకుంది.

అతను ఆశ్చర్యంగా అన్నాడు, "నీలిమా!" అని.

"పెళ్ళయిందన్నావ్...ఏమిటిలా...పబ్లిగ్గా...."

పెద్దగా నవ్వింది నీలిమా.

అతని జుట్టులో తన చేతి వ్రేళ్ళు పెట్టి నిమురుతూ,

"విశ్వం - యు ఆర్ మై హబ్బీ!" అన్నది.

విశ్వం కళ్ళు మెరిశాయి.

ఆమె నడుము మీద చేయి వేసి దగ్గరకు లాక్కున్నాడు.

అతని ఒళ్ళో పడుకున్న ఆమె హఠాత్తుగా అడిగింది.

"మధురానగరి సమీపంలో పాట పాడరూ... ఈ ఆనంద సమయంలో మీ నోట విని పరవశించాలని వుంది!"

నవ్వాడు విశ్వం.

మామూలుగా కాదు...పెద్దగా నవ్వాడు.

ఆమె బిత్తరపోయి చూసింది.

మళ్ళీ మళ్ళీ నవ్వాడు విశ్వం.

ఆమె అతని వడిలో నుంచి లేచి అతన్ని వింతగా చూసింది.

అతను నవ్వుతూనే లేచి, ఆమె భుజం తట్టి "పద పోదాం" అన్నాడు.

ఆమె మళ్ళీ అడిగింది - "ఆ పాట పాడండి... అయింతర్వాత వెడదాం" అన్నది.

అతను నవ్వుతూనే, ఆమెను చెయ్యిపట్టుకుని పైకిలేవదీశాడు. కారులో కూర్చుని, ఆమెను ప్రక్కన కూర్చోపెట్టుకుని, కారు స్టార్టు చేశాడు.

దారిలో ఆమె మళ్ళీ అడిగింది.

అతను నవ్వుతూనే జవాబు చెప్పాడు.."నీలిమా... ఆ పాటేకాదు... అన్ని పాటలూ మరచిపోయాను. నేను పాటలు పాడి అయిదేళ్ళు అయిందేమో. పాటల వరసలు, సాహిత్యం అన్నీ మరచిపోయాను. నా కంఠంలోని మాధుర్యమూ పోయింది. డబ్బు సంపాదనే నా లక్ష్యంగా పెట్టుకున్నాను. ఈ అయిదేళ్ళూ ఆ లక్ష్యంతోనే అహోరాత్రులూ కష్టపడ్డాను...నేను పాటలు పాడేటప్పుడు నా కడుపు నిండేది కాదు. ఆకలితో ఆక్రోశించేవాడిని, పాటలు పాడటం మరిచిపోయింతర్వాత, ఇప్పుడు నేను డబ్బులో మునిగితేలుతున్నాను. ఫర్‌గెటిట్ డార్లింగ్ అదో కల" నవ్వాడు విశ్వం పెద్దగా.

విశ్వం నవ్వు ఆమె చెవుల్లో భయంకరంగా మ్రోగుతున్నది.

కాసేపటికి ఆమె మెల్లగా అంది - "నేను ప్రేమించింది విశ్వాన్ని కాదు..విశ్వంలోని గాయకుడిని.. విశ్వంలోని గాయకుడిని!"

విశ్వం మళ్ళీ నవ్వుతూ ఆమె భుజం మీద చేయి వేశాడు.

"అదంతా మరచిపో నీలిమా... ఇప్పుడు మనం...."

"కారు ఆపండి" అరిచింది నీలిమ.

నీలిమ కారు దిగింది.

తలుపు గట్టిగా వేసింది.

విశ్వం వేపు సూటిగా చూసింది.

"ఇక మీరు వెళ్ళవచ్చు!" అంటూ ముందుకు నడిచింది.